# ఆసియాటోర్నీకి త్రిష, ధ్రుతి

- మహిళల ఆసియాటోర్నీకి భారత్


త్రిష

న్యూఢిల్లీ: కౌలాలంపూర్ వేదికగా ఈనెల 15 నుంచి 22వ తేదీ వరకు జరిగే అరంగేట్రం అండర్-19 మహిళల జూనియర్ ఆసియా కప్ టోర్నీకి భారత జట్టును ఎంపిక చేశారు. యువ క్రికెటర్ నికీ ప్రసాద్..భారత జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించనుండగా, సానిక చాల్కె వైస్‌కెప్టెన్‌గా బాధ్యతలు నిర్వహించనుంది. తెలంగాణ యువ క్రికెటర్లు గొంగడి త్రిష, కేసరి ధ్రుతితో పాటు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన పేసర్ ఎండీ శబ్నమ్ జాతీయ జట్టులో చోటు దక్కించుకున్నారు. గ్రూపు-ఏలో భారత్‌తో పాటు పాకిస్థాన్, నేపాల్ ఉండగా, గ్రూపు-బిలో బంగ్లాదేశ్, శ్రీలంక, ఆతిథ్య మలేషియా పోటీపడనున్నాయి. భారత్ తమ తొలి మ్యాచ్‌లో ఈనెల 15న పాక్‌తో, 17న నేపాల్‌తో ఆడుతుంది. గ్రూపులో టాప్-2లో ఉన్న జట్లు సూపర్-4కు అర్హత సాధిస్తాయి

# సంతోష్ ట్రోఫీకి తెలంగాణ టీమ్



హైదరాబాద్, ఆట ప్రతినిధి: హైదరాబాద్ వేదికగా జరుగనున్న సంతోష్ ట్రోఫీ కోసం తెలంగాణ ఫుట్‌బాల్ అసోసియేషన్(టీఎఫ్ఏ)గురువారం జట్టును ప్రకటించింది. ఈ నెల 14 నుంచి డిసెంబర్ 31వ తేదీ వరకు జరిగే టోర్నీ కోసం 22మందితో రాష్ట్ర టీమ్‌ను ఎంపిక చేశారు. ఈ ప్రతిష్ఠాత్మక టోర్నీకి 57 ఏండ్ల తర్వాత తొలిసారి హైదరాబాద్ ఆతిథ్యమిస్తున్నది. లీగ్ మ్యాచ్‌లు శ్రీనిధి దక్కన్ ఎరీనాలో, సెమీఫైనల్స్, ఫైనల్ మ్యాచ్‌లకు గచ్చిబౌలి స్టేడియం వేదిక కానుంది.

**తెలంగాణ ఫుట్‌బాల్ టీమ్:** ఇషాన్ సర్కార్, ఫయాజ్, రాజా దేబ్‌నాథ్, మినాల్, ఆర్నాల్డ్ సింగ్, క్రిస్, షేక్ ఉమైర్, జబైర్, కేహాన్, అభిషేక్, ఖఫ్, శ్రీకాంత్, సాయి, సైఫ్, తజమ్ముల్, వికాస్, ఇంతియాజ్, సైఫ్ అన్సారీ, శశాంక్, కిశోర్, రిజ్వి, అమన్.

# అభిషేక్ అ'ధర'హో

**20.50 లక్షలతో ముంబై సొంతం • జనవరిలో ఐఎస్‌పీఎల్ సీజన్-2**



ముంబై: ఇండియన్ స్ట్రీట్ ప్రీమియర్ లీగ్(ఐఎస్‌పీఎల్) రెండో సీజన్‌కు రంగం సిద్ధమైంది. వచ్చే జనవరి 26 నుంచి ఫిబ్రవరి 15వ తేదీ వరకు జరిగే టోర్నీ కోసం గురువారం ముంబైలో ప్లేయర్ల వేలం పాట నిర్వహించారు. ఇందులో లుధియానాకు చెందిన అభిషేక్ కుమార్ దాల్హోర్‌ను రికార్డు స్థాయిలో 20.50లక్షలకు ముంబై మాజీ జట్టు సొంతం చేసుకుంది. లీగ్‌కు ఎంపికైన అతిపిన్న వయసు(15 ఏండ్లు) ప్లేయర్‌గా శ్రీనగర్‌కు చెందిన షరిక్ యాసిర్ నిలిచాడు. దేశంలోని 55 నగరాల నుంచి దాదాపు 30లక్షలకు పైగా ప్లేయర్లు దరఖాస్తు చేసుకోగా 350 మందికి వేలంలో అవకాశం లభించింది. ఇందులో నుంచి 96 మంది ప్లేయర్లను ఆయా ఫ్రాంచైజీలు ఎంపిక చేసుకున్నాయి. హైదరాబాద్ నుంచి ప్రముఖ సినీ నటుడు రామ్‌చరణ్ యాజమాన్యంలో ఫాల్కన్ రైజర్స్ హైదరాబాద్ పోటీపడుతున్నది. లీగ్‌లో హైదరాబాద్ సహా టైగర్స్ ఆఫ్ కోల్‌కతా, మాజీ ముంబై, కేవీఎన్ బెంగళూరు స్ట్రైకర్స్, చెన్నై సింగమ్స్, శ్రీనగర్ కే వీర్ బరిలో ఉన్నాయి.



## గాయత్రి, త్రిసా జోడీ బోణీ

హాంగ్జౌ: ప్రతిష్ఠాత్మక బీడబ్ల్యూఎఫ్ ప్రపంచ టూర్ ఫైనల్స్ టోర్నీలో భారత యువ జోడీ గాయత్రి గోపీచంద్, త్రిసా జాలీ బోణీ కొట్టింది. గురువారం జరిగిన మహిళల డబుల్స్ రెండో రౌండ్ పోరులో గాయత్రి, త్రిసా ద్వయం 21-19, 21-19తో మలేషియాకు చెందిన పియర్లీ టాన్, తిన్నా మురళీధరన్ జంటపై అద్భుత విజయం సాధించింది. 46 నిమిషాల్లో ముగిసిన మ్యాచ్‌లో గెలువడం ద్వారా గ్రూపు-ఏలో సెమీఫైనల్ అవకాశాలను కాపాడుకుంది. శుక్రవారం జపాన్ జోడీపై గెలిస్తే గాయత్రి, త్రిసాకు సెమీస్ బెర్తు ఖరారైనట్లే. ఆది నుంచే జోరు కనబరిచిన భారత ద్వయం వరుస గేముల్లో ప్రత్యర్థిని చిత్తు చేసి మ్యాచ్‌ను కైవసం చేసుకుంది.



## బ్రిస్బేన్ ఒలింపిక్స్‌లో క్రికెట్!

**ప్రతినిధులతో ఐసీసీ చైర్మన్ షా భేటీ**

బ్రిస్బేన్: బ్రిస్బేన్ వేదికగా 2032లో జరిగే ఒలింపిక్స్‌లో క్రికెట్‌ను భాగం చేసేందుకు ఐసీసీ అడుగులు వేస్తున్నది. ఇటీవలే చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన జైషా..ఆ దిశగా ఒలింపిక్స్ ప్రతినిధులతో గురువారం ప్రత్యేకంగా భేటీ అయ్యాడు. ఇందుకు సంబంధించిన విషయాలను ఎక్స్ వేదికగా పంచుకున్నాడు. 'బ్రిస్బేన్(2032) ఒలింపిక్స్ ఆర్గనైజింగ్ కమిటీ చీఫ్ సిండీ హుక్, క్రికెట్ ఆస్ట్రేలియా సీఈవో నిక్ హాక్లేతో భేటీ జరిగింది. విశ్వక్రీడల్లో క్రికెట్‌ను భాగం చేసేందుకు చర్చించాం' అని ట్వీట్ చేశాడు. 128 ఏండ్ల తర్వాత 2028 లాస్‌ఏంజిల్స్ ఒలింపిక్స్‌లో క్రికెట్‌ను తిరిగి ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే.

పిన్న వయసు ప్లేయర్‌గా అరుదైన రికార్డు

# జగజ్జేత గుకేశ్

## ప్రపంచ చెస్ చాంపియన్‌షిప్ టైటిల్ కైవసం

**ఫైనల్ గేమ్‌లో లిరెన్‌పై అద్భుత విజయం • రాష్ట్రపతి ముర్ము, ప్రధాని మోదీ ప్రశంసలు**



**ప్రైజ్‌మనీ**
విజేత
గుకేశ్: **11.34** కోట్లు
రన్నరప్
లిరెన్: **9.66** కోట్లు

**అద్భుతం ఆవిష్కృతమైంది! ప్రపంచ చదరంగంపై భారత మువ్వన్నెల పతాకం సగర్వంగా రెపరెపలాడింది. అంచనాలకు మించి రాణిస్తూ అతి పిన్న వయసులో(18 ఏండ్లు)నే భారత యువ గ్రాండ్‌మాస్టర్ దొమ్మరాజు గుకేశ్ వరల్డ్ చాంపియన్ కిరీటం కైవసం చేసుకున్నాడు. ఆఖరి గేమ్‌లో అద్భుత ప్రదర్శన కనబరుస్తూ చైనాకు చెందిన డింగ్ లిరెన్‌ను మట్టికరిపించాడు. ప్రత్యర్థి పొరపాటును తనకు అనుకూలంగా మలుచుకుని ప్రపంచ టైటిల్‌ను ముద్దాడాడు. ఆరాధ్య ఆటగాడు, దిగ్గజ ప్లేయర్ విశ్వనాథన్ ఆనంద్ తర్వాత మెగాటోర్నీ గెలిచిన రెండో భారతీయుడిగా గుకేశ్ అరుదైన ఘనత సొంతం చేసుకున్నాడు. ఆశలు లేని స్థితి నుంచి అద్భుతాన్ని సృష్టిస్తూ గుకేశ్ సాధించిన విజయానికి దేశం యావత్తు గర్వంతో ఉప్పొంగిపోయింది. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ మొదలు పలువురి ప్రముఖుల ప్రశంసలతో గుకేశ్ తడిసిముద్దయ్యాడు.**

సింగపూర్: భారత చదరంగ చరిత్రలో నూతన అధ్యాయం. 64 గళ్ల గేమ్‌లో దేశ ఖ్యాతిని మరింత ద్విగుణీకృతం చేస్తూ దొమ్మరాజు గుకేశ్ కొత్త చరిత్ర లిఖించాడు. డిఫెండింగ్ చాంపియన్ డింగ్ లిరెన్‌ను చిత్తు చేస్తూ ప్రతిష్ఠాత్మక చెస్ చాంపియన్‌షిప్‌లో టైటిల్ విజేతగా నిలిచి అందరినీ ఆశ్చర్యపరిచాడు. గురువారం జరిగిన ఆఖరిదైన 14వ గేమ్‌లో నల్లపావులతో బరిలోకి దిగిన ఈ 18 ఏండ్ల కుర్రాడు..లిరెన్(6.5)ను కట్టిపడేస్తూ 7.5 పాయింట్లతో టైటిల్ ఒడిసిపట్టుకున్నాడు. గేమ్‌కు ముందు ఇద్దరు 6.5 పాయింట్లతో సమంగా ఉండగా, విజేతను నిర్ణయించే ఈ పోరులో గుకేశ్‌కు అదృష్టం కలిసోచ్చింది. నాలుగు గంటల పాటు సుదీర్ఘంగా సాగిన ఫైనల్ గేమ్ పోరు 58 ఎత్తుల్లో ముగిసింది. అప్పటి వరకు కనీసం డ్రా కోసమైనా ప్రయత్నం చేద్దామనుకున్న గుకేశ్‌కు లిరెన్ చేసిన ఘోర తప్పిదం ప్రపంచ విజేతగా నిలిచేలా చేసింది. 55 ఎత్తులో లిరెన్ వేసిన తప్పటడుగుతో ఒకింత ఆశ్చర్యపోయిన గుకేశ్ గేమ్‌ను మరో మూడు ఎత్తుల్లోనే ముగించి తన కలను సాకారం చేసుకున్నాడు. విజయం తనదేనని భావించిన ఈ కుర్రాడు..ఒకింత భావోద్వేగానికి గురయ్యాడు. ఆనందంతో ఉబికి వస్తున్న కన్నీటిని రెండు చేతులతో ఆపుకుంటూ విజయాన్ని ఆస్వాదించాడు. గేమ్ ముగిసిన తర్వాత అభిమానులకు అభివాదం చేస్తూ కనిపించాడు. సుదీర్ఘ ప్రపంచ చెస్ చాంపియన్‌షిప్ చరిత్రలో టైటిల్ గెలిచిన పిన్న వయసుగా ప్లేయర్‌గా గ్యారీ కాస్పరోవ్(22 ఏండ్లు, రష్యా) రికార్డును చెరిపేస్తూ గుకేశ్ అరుదైన ఘనతను తన పేరిట లిఖించుకున్నాడు. దీనికి తోడు ఐదుసార్లు ప్రపంచ విజేత విశ్వనాథన్ ఆనంద్ తర్వాత ప్రతిష్ఠాత్మక టైటిల్ గెలిచిన రెండో భారత ప్లేయర్‌గాను నిలిచాడు. టైటిల్ సొంతం చేసుకున్న గుకేశ్‌కు రూ.11.34 కోట్ల ప్రైజ్‌మనీ దక్కింది. సరిగ్గా 10 ఏండ్ల క్రితం 2013లో భారత్ నుంచి ప్రపంచ చెస్ టోర్నీలో ఆనంద్ విజేతగా నిలిచాడు.

**టోర్నీ సాగిందిలా**

| గుకేశ్ | గేమ్ | లిరెన్ |
|---|---|---|
| 0 | 1 | 1 |
| 0.5 | 2 | 0.5 |
| 1 | 3 | 0 |
| 0.5 | 4 | 0.5 |
| 0.5 | 5 | 0.5 |
| 0.5 | 6 | 0.5 |
| 0.5 | 7 | 0.5 |
| 0.5 | 8 | 0.5 |
| 0.5 | 9 | 0.5 |
| 0.5 | 10 | 0.5 |
| 1 | 11 | 0 |
| 0 | 12 | 1 |
| 0.5 | 13 | 0.5 |
| 1 | 14 | 0 |
| 7.5 | మొత్తం | 6.5 |

**పిన్న వయసు విజేతలు**

| | |
|---|---|
| గుకేశ్ | 18 ఏండ్ల 8 నెలలు |
| కాస్పరోవ్ | 22 ఏండ్ల 6 నెలలు |
| కార్ల్‌సన్ | 22 ఏండ్ల 11 నెలలు |
| మికాయిల్ తాల్ | 23 ఏండ్ల 5 నెలలు |
| కార్పోవ్ | 23 ఏండ్ల 10 నెలలు |



"గత 10 ఏండ్లుగా ఈ చిరస్మరణీయ విజయం కోసం ఎదురుచూస్తున్నాను. కల సాకారం కావడం చాలా సంతోషంగా ఉంది. గెలుపు అసలు ఊహించలేదు అందుకే ఒకింత ఉద్వేగానికి గురయ్యాను. ప్రతీ ప్లేయర్ ఇలాంటి కల కోసం ఎదురుచూస్తాడు. క్యాండిడేట్స్ టోర్నీ నుంచి ప్రపంచ చాంపియన్‌షిప్ వరకు నా వెన్నంటి నిలిచిన భగవంతునికి కృతజ్ఞతలు. 2013లో విశీసార్(ఆనంద్), కార్ల్‌సన్ మధ్య పోరు టీవీలో చూశాను. ఆ టోర్నీలో కార్ల్‌సన్ గెలువడంతో ఎలాగైనా ప్రపంచ టైటిల్‌ను భారత్‌కు తిరిగి తీసుకురావాలని అప్పుడే నిశ్చయించుకున్నాను. కార్ల్‌సన్ అంత స్థాయికి ఎదుగాలనుకుంటున్నాను. లిరెన్ నిజమైన ప్రపంచ చాంపియన్. అతని పోరాట పటిమ అమోఘం.నా విజయంలో మానసిక నిపుణుడు ప్యాడీ ఆప్టన్ పాత్ర చాలా విలువైనది. 12 గేమ్ తర్వాత నాకు సరైన నిద్ర లేదు. ఈ సమయంలో ప్యాడీని సంప్రదించడం కలిసొచ్చింది.

"ప్రపంచ చెస్ చాంపియన్‌షిప్ టైటిల్ గెలిచిన పిన్న వయసు ప్లేయర్‌గా నిలిచిన గుకేశ్‌కు హృదయపూర్వక అభినందనలు. అతని ప్రదర్శనతో భారత్ గర్వపడుతున్నది. మెగాటోర్నీలో అతని విజయం చెస్‌లో భారత్ పవర్‌హౌజ్ అని నిరూపిస్తున్నది. వెల్‌డన్ గుకేశ్! ప్రతీ భారతీయుని తరపున భవిష్యత్‌లోనూ మరిన్ని విజయాలు సాధించాలని ఆశిస్తున్నాను **- రాష్ట్రపతి ద్రౌపది ముర్ము**

"చిరస్మరణీయ విజయం సాధించిన గుకేశ్‌కు శుభాకాంక్షలు. ఈ ఫలితం అతని అద్భుతమైన ప్రతిభ, హార్డ్‌వర్క్, సాధించాలన్న పట్టుదలకు నిదర్శనం. ఈ విజయంతో చెస్ చరిత్రలో అతని పేరు చిరకాలం నిలిచిపోవడమే కాదు, కోట్లాది మంది యువతకు స్ఫూర్తిగా నిలుస్తుంది. అతని భవిష్యత్ లక్ష్యాలు నెరవేరాలని కోరుకుంటున్నాను **- ప్రధాని నరేంద్రమోదీ**

# మోహన్‌బాబుపై హత్యాయత్నం కేసు

**మీడియా ప్రతినిధిపై దాడి ఘటనలో నమోదు**

**దవాఖాన నుంచి మోహన్‌బాబు డిశ్చార్జి, రెండో ఆడియో విడుదల**



హైదరాబాద్ సిటీబ్యూరో, డిసెంబర్ 12 (నమస్తే తెలంగాణ): సినీనటుడు మంచు మోహన్‌బాబుపై హత్యాయత్నం కేసు నమోదైంది. జల్‌పల్లిలోని మోహన్‌బాబు ఇంటి ఆవరణలో మీడియా ప్రతినిధిపై దాడి కేసులో పహాడీషరీఫ్ పోలీసులు కేసు నమోదు చేశారు. బుధవారమే మోహన్‌బాబుపై కేసు నమోదైనప్పటికీ న్యాయసలహాలు తీసుకున్న పోలీసులు గురువారం బీఎన్ఎస్ 109 హత్యాయత్నం సెక్షన్ జోడించారు. ఇప్పటికే మనోజ్‌పై దాడి కేసులో మోహన్‌బాబు మేనేజర్ కిరణ్‌ను అరెస్ట్ చేశారు. మరోవైపు అనారోగ్యంతో గచ్చిబౌలి కాంటినెంటల్ దవాఖానలో చికిత్స పొందిన మోహన్‌బాబు గురువారం డిశ్చార్జి అయ్యారు. అనంతరం రెండో ఆడియో విడుదల చేశారు. మీడియా ప్రతినిధిపై దాడికి సంబంధించి అభిప్రాయాలు పంచుకున్నారు.

**మీడియా ప్రతినిధా.. పగవాడా?**

"మీడియా ప్రతినిధిపై ఉద్దేశపూర్వకంగా దాడి చేయలేదు. నాలుగు రోజులుగా మీడియా మిత్రులు వ్యాన్స్ పెట్టుకుని మా ఇంటివద్దే ఉన్నారు. నా కుటుంబ సమస్యను నేను పరిష్కరించుకుంటానని మంగళవారం ఉదయమే వాళ్లకు చెప్పాను. రాత్రి వేళల్లో గేట్లు తీసుకుని, అనుమతి లేకుండా నా ఇంట్లోకి రావడం ఏంటి? వచ్చిన వాళ్లంతా మీడియా సోదరులా? చేతిలో మైక్ పట్టుకుని పగవాళ్లు ఎవరైనా వచ్చారా? అని నాకు డౌట్ ఉంది. మైక్ తీసుకొచ్చి నోటి దగ్గర పెట్టారు. అది కంటి కింద తగిలింది. చీకట్లో ఘర్షణ జరిగింది. మీడియా ప్రతినిధికి దెబ్బ తగలడం బాధగా ఉంది. మీడియా మిత్రుడిని కొట్టడం తప్పే. కానీ ఏ పరిస్థితుల్లో కొట్టాననేది ఆలోచించండి"

–మంచు మోహన్‌బాబు



## ఏబీటీవో అధ్యక్షుడిగా మల్లేపల్లి

నందికొండ, డిసెంబర్ 12 : అంతర్జాతీయ బుద్ధిస్ట్ టూర్ ఆపరేటర్ అసోసియేషన్ (ఏబీటీవో) అధ్యక్షుడిగా బుద్ధవనం మాజీ ప్రత్యేకాధికారి మల్లేపల్లి లక్ష్మయ్య నియమితులయ్యారు. బీహార్‌లోని వైశాలిలో ఈ నెల 10న నిర్వహించిన ఏబీటీవో వార్షికత్సోవంలో ఆయన్ను ఎన్నుకున్నారు. లక్ష్మయ్య మాట్లాడుతూ.. రాష్ట్ర, దేశ, విదేశీ స్థాయిలో బుద్ధిస్ట్ సంఘాలను సమైక్యపరుస్తూ బౌద్ధమత వ్యాప్తికి కృషి చేస్తానని తెలిపారు.

## హోంగార్డులకు అందని వేతనాలు

హైదరాబాద్, డిసెంబర్ 12 (నమస్తే తెలంగాణ) : సకాలంలో వేతనాలు రాక హోంగార్డులు ఆర్థికఇబ్బందులు పడుతున్నారు. ఈ నెల వేతనం కోసం 12 రోజులుగా ఎదురుచూసినా ఫలితం లేకపోవడంతో తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ప్రతినెలా జీతం ఆలస్యం అవుతుండటంతో కుటుంబం గడువడం కష్టంగా మారిందని చెప్తున్నారు. చెక్‌బౌన్స్‌లు అవుతున్నాయని, ఈఎంఐ డేట్‌లు ముగిసి సిబిల్ స్కోర్ పడిపోతుందని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. పిల్లల స్కూల్ ఫీజులు, ఇంటి ఖర్చులు, అద్దెలు, పెట్రోల్ అవసరాలకు డబ్బులు సర్దడం కష్టంగా మారిందని వాపోతున్నారు. బీఆర్ఎస్ హయాంలో ప్రతినెలా 1, 2 తారీకుల్లో వేతనాలు పడుతుంటే ఇబ్బందులు లేకపోయేవని పేర్కొంటున్నారు. 5వ తారీకులోగా చెల్లించాలని కోరుతున్నారు.

## ఇబ్రహీంపట్నం సీఐపై బదిలీ వేటు

ఇబ్రహీంపట్నం రూరల్, డిసెంబర్ 12 : రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం సీఐపై బదిలీ వేటుపడింది. ఈనెల 2న ఇబ్రహీంపట్నం మండలం రాయపోల్ సమీపంలో సొంత తమ్ముడి చేతిలో మహిళా కానిస్టేబుల్ నాగమణి దారుణంగా హత్యకు గురైన విషయం తెల్సిందే. ఈ కేసు విషయంలో సీఐ సత్యనారాయణ నిర్లక్ష్యంగా వ్యవహరించాడని ఆయన్ను కమిషనరేట్‌కు అటాచ్ చేస్తూ గురువారం రాచకొండ సీపీ సుధీర్‌బాబు ఉత్తర్వులు జారీ చేశారు. కాగా నాగమణి హత్యకేసులో నిందితుడిగా ఉన్న అచ్చన శివను గురువారం అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించినట్టు ఇబ్రహీంపట్నం పోలీసులు తెలిపారు.

# బతుకమ్మ తొలగింపు సిగ్గుచేటు

- **బతుకమ్మ చరిత్ర ఇటలీ సోనియాగాంధీకి తెలియదు**
- **రాష్ట్ర నేతలకైనా సోయి ఉండాలి కదా!: ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి**



హైదరాబాద్, డిసెంబర్ 12 (నమస్తే తెలంగాణ): బతుకమ్మ సంస్కృతిని తెలంగాణ తల్లి నుంచి వేరు చేసినందుకుగాను మహిళా లోకానికి రాష్ట్ర ప్రభుత్వం క్షమాపణ చెప్పాలని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఇటలీకి చెందిన సోనియాగాంధీకి బతుకమ్మ సంస్కృతీ, సంప్రదాయాలు తెలియకపోయినా, రాష్ట్ర నేతలకైనా సోయి ఉండాలి కదా? అని మండిపడ్డారు. తెలంగాణ భవన్‌లో గురువారం బీఆర్ఎస్ నేతలు సంజీవ్‌నాయక్, పల్లయ్య కురువతో కలిసి మీడియాతో మాట్లాడారు. తెలంగాణ ఆడబిడ్డల సంప్రదాయమైన బతుకమ్మ పండుగను కేసీఆర్ ప్రభుత్వం అధికారికంగా నిర్వహించిందని గుర్తుచేశారు. ఆడబిడ్డలకు చీరలు పంపిణీ చేశారని, కాంగ్రెస్ ప్రభుత్వం కనీసం చీరలిచ్చి గౌరవించలేని పరిస్థితిలో ఉందని మండిపడ్డారు. చీరలు ఎందుకు ఇవ్వలేదు అని ప్రశ్నించినందుకు.. అసలు బతుకమ్మనే లేదనేలా వ్యవహరించడం సిగ్గుచేటని ఆగ్రహం వ్యక్తంచేశారు. తెలంగాణ సంస్కృతిని అవమానపర్చిన వారికి ప్రజలు కచ్చితంగా బుద్ధి చెప్తారని హెచ్చరించారు. తెలంగాణ తల్లి చేతిలో ఉన్న బతుకమ్మను తీసేసి చేతిగుర్తుకు ఓటు వేయాలన్నట్టుగా అభయహస్తం పెట్టడం దారుణమని మండిపడ్డారు. తెలంగాణ సంస్కృతి గురించి అవగాహన లేకనే కాంగ్రెస్ నాయకులు బతుకమ్మపై నోరుజారుతున్నారని, తెలంగాణ సమాజానికి క్షమాపణ చెప్పాలని ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి డిమాండ్ చేశారు. కాంగ్రెస్ నేత యెన్నం శ్రీనివాస్‌రెడ్డి బతుకమ్మ కించపరిచే మాటలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ నేతలు అద్దంకి దయాకర్, బెల్లయ్య నాయక్‌కు తెలంగాణ సంస్కృతి, బతుకమ్మ గురించి తెలియకపోతే భార్యలను అడగాలని సూచించారు. బతుకమ్మను కించపరిచేలా మాట్లాడడం కాంగ్రెస్ నాయకులకే చెల్లిందని విమర్శించారు. తెలంగాణ తల్లి రూపాన్ని మార్చడంపై ప్రొఫెసర్ కోదండరాం తన గౌరవాన్ని తగ్గించుకునేలా మాట్లాడారని విమర్శించారు. పదవులు వచ్చిన తర్వాత తెలంగాణ సంస్కృతిని మరిచి, ఇటలీ సంస్కృతిని పాటిస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ సంస్కృతిపై విషప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నేతలకు తెలంగాణలో తిరిగే హక్కు లేదని, ధోరణి మార్చుకోకపోతే ప్రజలే అడ్డుకుంటారని హెచ్చరించారు.

# 70% గ్రామాల్లో బతుకమ్మ ఆడరు

- **మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి వివాదాస్పద వ్యాఖ్యలు**
- **తెలంగాణవాదులు, నెటిజన్ల ఫైర్**



హైదరాబాద్, డిసెంబర్ 12(నమస్తే తెలంగాణ): బతుకమ్మ పండుగ, సంప్రదాయంపై మహబూబ్‌నగర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. బతుకమ్మ పండుగను కొన్ని వర్గాలకు, కొన్ని ప్రాంతాలకు పరిమితం చేసే ప్రయత్నం చేశారు. ప్రభుత్వం బతుకమ్మ లేకుండా తెలంగాణ తల్లి విగ్రహం రూపొందించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో ఈ అంశంపై శ్రీనివాస్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. "తెలంగాణలో 70శాతం గ్రామాల్లో బతుకమ్మ ఆడరు. ఒకవేళ ఆడినా కూడా అగ్రకులాలకు చెందిన మహిళలకు మాత్రమే ఆడుతారు. దళిత, బహుజనులు బతుకమ్మ ఆడిన సందర్భాలు ఎప్పుడూ లేవు. బతుకమ్మ అనేది వరంగల్ ప్రాంతంలో ఎక్కువగా ఆడుతారు తప్ప మిగిలిన జిల్లాల్లో ఆడరు" అంటూ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఎమ్మెల్యేపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. తెలంగాణవాదులు, నెటిజన్లు విమర్శలు గుప్పిస్తున్నారు. బతుకమ్మను కొన్ని వర్గాలకే పరిమితం చేయడంపై ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.




Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.